# నీల

కె.ఎన్. మల్లీశ్వరి



తానా

బహుమతి నవల

# NEELA

*TANA Prize Winning Novel*

*by* **K.N. Malleeswari**
39-5-11, 2nd Layout, Murali Nagar
Visakhapatnam - 530 007.
**Email: malleswari.kn2008@gmail.com**

*This novel was written during*
**July 2011 - January 2017**

© Author

***Released***
**On 25th December 2017 at Hyderabad**

*First Publication: December, 2017*

*Publication Number: 6*

*Publication*
**TANA (Telugu Association of North America) Publications**
20374 Buckthorn Court, Mundelein, Illinois, 60060, USA

*Local Address*
AG-2, 'A' Block, Mathrusri Apts., Hyderguda,
Hyderabad-500 029. Ph.: 040-2324 4088

*Cover Paintings*
**Ale Laxman**

*Cover Design*
**Akshara Creators,** Hyderabad
Email: sakshara@gmail.com

*Copies available at*
**Visalandhra Publishing House,** Vijayawada and its Branches in Andhra Pradesh; **Navachetana Publishing House,** Hyderabad and its Branches in Telangana; **Navodaya Book House,** Kachiguda, Hyderabad; **Prajashakti Book House,** Hyderabad and its branches in Andhra Pradesh

*e-book:* **www.kinige.com**

*Composed at* **Printex,** Daba Gardens, Visakhapatnam.
Ph.: 0891-2740795

*Printed at* **Charita Impressions**
Azamabad Industrial Area, Hyderabad, India.
Ph.: 040-2766 78411

**₹250 $ 20**

# 1

## హైదరాబాద్ 2011

"సముద్రం ఎందుకు వెనక్కి వెళ్తుందో తెలుసా నీలగారూ?"

బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి బైటికి వస్తుండగా ఆ మాట వినపడింది. ఆగి, అటువైపు ఆశ్చర్యంగా చూసింది నీల.

లోపల ఇంకా మీటింగ్ అవుతోంది. పాటలు వినిపిస్తున్నాయి. దూరం వెళ్ళాలి కదాని తను మాట్లాడగానే వచ్చేసింది నీల. ఇక్కడ ఎంట్రన్స్ దగ్గర ఈ చిరపరిచితమైన ప్రశ్న ఎదురైంది.

పరదేశి.

పదకొండేళ్ళ తర్వాత చూస్తున్న పరదేశి!

నీల గుండె వేగంగా కొట్టుకోసాగింది.

ఒకప్పటి మీగడ ఒంటి మనిషి. ఇపుడు దేహం మీద నుంచి చూపుని ఎటో పారేసుకున్న మనిషిలా ఉన్నాడు. మెత్తని అలలు ఒకదానిని మరొకటి కప్పుకుని బద్ధకంగా పడుకున్నట్లు ఉండే క్రాఫ్ చెరిగి పోయి నిర్లక్ష్యంగా చూస్తోంది.

"మీరూ...మీరేనా!! ఎన్నాళ్ళయింది చూసి!" సంభ్రమంతో ఆమె మాట తడబడుతూ ఉంది. అనేక ఉద్రిక్త భావాలు ఒకేసారి ముసురుకోవడం అంటే ఇదేనేమో అనిపించింది.

గబగబా అతని దగ్గరకి వెళ్ళింది. గతమేదీ గుర్తులేని సంబరం ఆమె మాటలో వినపడింది పరదేశికి. ఆ గుర్తు లేకపోవడం అతనికి నచ్చలేదు.

ఇన్నేళ్ల తర్వాత కలిసిన ఆమె పట్ల ఒక పక్క ప్రేమగానూ ఉంది. మరో పక్క గాయం రేగినట్లుగానూ ఉంది.

నవ్వు మొహంతో తనని సమీపిస్తున్న ఆమెని క్షణం పరిశీలనగా చూసాడు పరదేశి. అప్పటికీ ఇప్పటికీ ఆమెలో వచ్చినమార్పుని గుర్తుపట్టగలిగాడు. చాలా మారింది. లేతాకు పచ్చరంగు కాటన్ కుర్తీ, లైట్ బ్లూ జీన్స్‌లో చిన్నపిల్లలా ఉంది.

ఒత్తుగా మొహం మీద పడుతున్నట్లుండే జుత్తుని పైకి మడిచి వెదురు క్లిప్ పెట్టుకుంది. మనిషి తేటగా కనపడుతోంది.

"ఎన్నాళ్ళకి కాదు ఎన్నేళ్ళకి కలిసాం అనాలి." ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు.

చుట్టూ కోలాహలంగా ఉంది.

హాల్ కిక్కిరిసి పోయి ఉంది. లోపల కూచోడానికి చోటు చాలని వాళ్ళు బయట తచ్చాడుతున్నారు. కొందరు మిత్రులతో కబుర్లలో ఉన్నారు.

మైక్ లోంచి ఎవరిదో గొంతు కంచులా మోగుతోంది. ఆ పాటని వింటున్నట్లు కళ్ళు మూసి తెరిచాడు.

"ఆ చల్లని సముద్ర గర్భం...

దాచిన బడబానలమెంతో" - వింటూ చిన్నగా నవ్వాడు.

ఆ నవ్వులో వెల్తి, తమ ఎడబాటు మీది అపహాస్యం తెరలు తెరలుగా కదులుతున్నట్లు అనిపించింది నీలకి.

"ఎలా ఉన్నారు? ఎన్నిసార్లు తలచుకుంటూ ఉంటానో!" అభిమానంగా చూస్తూ షేక్‌హాండ్ కోసం చెయ్యి చాపింది.

అననైతే అన్నది కాని, తనకే బోలుగా అనిపించాయా మాటలు. ఖాళీ మాటలా తనవి? పరదేశిని ఎట్లా తీసుకోవాలో తెలీక మనసు సతమతవుతోంది.

అతనికి దుఃఖం వచ్చింది. అట్లా చాపిన ఆ చేతిని పట్టుకుంటే ఇక వదలను అని చెప్పాలనిపించింది. అంతలోనే ఇన్నేళ్ళ పాటు ఆమె ఊసు లేకుండానే బతికాను కదా ఇపుడు మాత్రం ఈ కలవరం ఎందుకు అన్న నిర్లిప్తత చుట్టుముడుతోంది.

అతనిలో జరుగుతున్న ఘర్షణని గుర్తు పట్టింది నీల. జరిగినవాటిని తను మరిచి పోయినట్లు అతను మరిచిపోలేదు అన్న ఊహ ఇబ్బంది పెడుతోంది.

ఆమె చేతిని మెల్లగా పట్టుకుని వదిలి,

"మీరెలా ఉన్నారు? అపుడెలా ఉన్నారో ఇపుడూ అలాగే ఉండలేంకదా! మీరైనా నేనైనా ఇంకెవరైనా" అన్నాడు.

నీల ఏమీ మాట్లాడకపోయేసరికి,

"ఎలా ఉండటమంటే ఏంటి అన్న తత్వంలోకి వెళ్లిపోయారా?" తనే అన్నాడు మళ్ళీ.

దానికీ సమాధానం చెప్పలేదు. అతనికి తనమీద ఇంకా కోపమో ద్వేషమో ఉండొచ్చు నన్న ఊహ చికాకు పెడుతోంది.

ఎవరి బతుకుల్లో వాళ్ళు స్థిరపడ్డాక ఇట్లా కలిసినపుడు గాయాలు మాసిపోయి మంచి విషయాలు గుర్తుంటే బావుంటుంది అనుకుంది.

## 2

# చోళదిబ్బ 1986

'ఊళ్లోకి రాగానే కుడిచేతి వైపు రామాలయం, ఎడంచేతి వైపు కలవపూలతో నిండిన చెరువు. కాస్త ముందుకు వెళ్ళగానే గలగలాకుల రావిచెట్టు, దాని మొదలు చుట్టూ కట్టిన రచ్చబండ. దాని మీద కూచుని తాపీగా పేపర్ చదువుతూ రాజకీయాలు మాట్లాడుకునే మనుషులు, గోధూళి వేళ ఎర్రబడిన పడమటి ఆకాశం' ఆ ఊరి గురించి ఇట్లా శాస్త్రీయంగా ఊహించి, చేతిలోని కళకి పుంజాలు తెంపాలని చూస్తే ఆశాభంగమే కలుగుతుంది.

అడుగు పెట్టగానే ముందుగా పలకరించేది మురిక్కాలవ. ఇళ్ళ ముందర నుంచి పారుతూ వెళ్లి పూడిక తీయని చిన్న చెరువులో కలుస్తుంది. ఏలూరు పాత బస్టాండ్ దగ్గర ఉన్న పెద్దబజార్లో రాత్రి తొమ్మిదికి కొట్లు కట్టేయగానే కుళ్ళి పోయిన కూరగాయలు, వాడిపోయిన పూలదండలు, పగిలిపోయిన, విరిగి పోయిన పాత సామాను, చెత్తాచెదారం తెచ్చి ఊరి మొదటన ఉన్న ఖాళీ స్థలంలో పడేసి పోతారు. తడి చెత్త పొడి చెత్త కలగలిసి పోయి వర్షాలు పడ్డాయంటే అక్కడ కాలు పెట్టడానికి వీలు లేకుండా ఉంటుంది.

చోళదిబ్బ ఒక ఊరు,
నీలవేణి సొంత ఊరు.

ఏలూరిని బాగా ఆనుకుని ఉండడంతో ఒక్కోసారి టౌన్‌లాగా ఒక్కోసారి ఊరులాగా కనపడుతుంది చోళదిబ్బ. మున్సిపాలిటీ పరిధిని పెంచినపుడు ఆ ఊరిని ఏలూరిలో కలిపేయాలని కొన్ని ప్రయత్నాలు జరిగినా పన్నుపోటు తగులుతుందని వద్దని వారించిన వాళ్ళున్నారు. చివరికి అది పంచాయితీగానే ఉండిపోయింది. నాలుగు వేల జనాభాలో దాదాపు అరవై శాతం గవర్లు కమ్మర్లు ఉప్పర్లు పద్మశాలీలు గొల్ల కులస్తులు ఉంటే ఇరవైశాతం మాలా మాదిగ కులస్తులు. అందులోనూ దళిత క్రిస్టియన్లు ఎక్కువ. మిగతా వాళ్ళలో కమ్మ కోమటి బ్రాహ్మణ కులస్తులు ఉండేవారు.

పొద్దున్న ఆరయ్యేసరికి ఏలూరు జూట్‌మిల్లు సైరన్ లీలగా వినపడింది.

అది ఆ వూరి అలారం.

నీల, నిద్ర మొహంతో బైటకి వచ్చి, తలెత్తి ఆకాశం వంక చూసింది. మబ్బులు లేకుండా ఖాళీగా ఉంది. "ఉప్పుడు మబ్బులుండవు." తనకి తనే చెప్పుకుంది.

దాలిగుంట లోనుంచి కచ్చిక తెచ్చుకుని పళ్ళు తోముకుంది నీల.

ఈ లోపు పక్కింటి చిలకమ్మ నడిమికూతురు కళ్ళు నులుముకుంటూ బైటకి వచ్చింది. ఆ పిల్లని ఊరంతా 'నడిపిది' అంటారు. రాగానే చెయ్యి పైకెత్తి జబ్బతో జుట్టు వెనక్కి నెట్టుకుని చుట్టూ చూసింది. ఆ వీధంతా ఆదివారం త్వరగా లేచిన పిల్లల అలజడితో ఉంది. వాళ్లను చూసుకుంటూ నీలవాళ్ళ ఇంటివైపుకి వచ్చింది నడిపిది.

నీల కోళ్ళగూడు దగ్గర కూచుని కోడిపెట్టకి జాగ్రత్తలు చెపుతూ ఆ పిల్లల కోడిని బైటకి వదిలింది.

గూడునుంచి బైటకిరాగానే తల్లికోడి తోక దులపరించుకుని ఉషారు తెచ్చుకుని పిల్లల్ని వెంటేసుకుని తిండికోసం బయలుదేరింది.

నడిపిది ఆకాశం అంచువంక చూసి తేలకళ్ళు వేసింది. నీల కూడా చూసింది. జూట్‌మిల్ బ్రాయిలర్ల నుంచి పొగ మేఘాలు వస్తున్నాయి. అందులో ఒక మేఘం పెద్ద చెట్టు మాదిరిగా ఉంది. నిజానికి ఆ మేఘాలు ఎపుడూ రకరకాల జంతువుల ఆకారాలతో ఉండేవి. అవి పైనుంచి తమ మీదకి దూకబోతున్నట్లు పిల్లలు ఊహించేవారు.

అవి మంచివో కావో వాళ్లకి తెలీదు కానీ మనుషులే వాటిని సృష్టిస్తున్నారని అందులో తమ ఊరివాళ్ళు కూడా ఉన్నారని తెలిసినపుడు ఆ కార్మికులని మామూలు మనుషులుగా కాక విచిత్ర జీవులుగా చూసేవారు.

కాసేపు చూసాక నీలకి పొట్టలోపల నకనకలు మొదలయ్యాయి. చుట్టూ నిశ్శబ్దంగా ఉండటంతో పేగుల శబ్దం నడిపిదానికి వినబడి అది నవ్వింది. నీల పొట్ట చేత్తో అదుముకుని కరకర శబ్దాలని ఆపాలని చూసింది. అదిమిపెట్టినంత సేపూ ఊరుకుని మళ్ళీ చెయ్యి తియ్యగానే గుర్రుమన్నాయి. నడిపిది విరగబడి నవ్వింది. నీలకి కోపం వచ్చింది. దాని నెత్తి మీద మొత్తబోయి అది నాలుగోతరగతి చదువుతుంటే తను ఏడోతరగతి అన్నది గుర్తు తెచ్చుకుని దాన్ని క్షమించే బాధ్యత నెత్తినేసుకుని లోపలికి వచ్చింది.

నీల నాన్న పరశురామయ్య. అందరూ పరిశి అని పిలుస్తారు.

ఏలూరు జూట్‌మిల్లు కార్మికుడు.

ఎంత సంపాదిస్తాడో ఎవ్వరికీ తెలీదు. ఒక్క రూపాయ తెచ్చి చేత బెట్టింది

## 3

# రాజమండ్రి 1991

రాజమండ్రి వెళ్ళే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రసాద్ పక్కన ముడుచుకుని కూచుంది నీల. ముక్కూమొహం తెలియని జనాలు వాళ్లిద్దరినీ చూసి ముసిముసిగా నవ్వుకుంటున్నారు. నీల మెడలో పసుపుతాడు, కాళ్ళకీ చేతులకీ పారాణి, ప్రసాద్‌ని ఆనుకుని కూచుని బిక్కుబిక్కుమని చుట్టూ చూస్తుండటం బాగా పట్టిచ్చినట్లున్నాయి.

ఎవరో తెలీని అంతమంది జనాలమధ్య ఇక తనకు ఉన్నది ప్రసాద్ ఒక్కడే అన్నది మరింత తెలిసివస్తోంది నీలకి. ఆ ఆలోచనకి గుండె గుభిల్లుమంటోంది.

ఏదో నెపంమీద ప్రసాద్ మోచేతివద్ద అరచెయ్యి చుడుతూ స్పర్శద్వారా తనమనిషి అనే చనువు కూడగట్టుకుంటోంది.

ఆ మూడు గంటల ప్రయాణంలో ప్రసాద్ నీలని అవీ ఇవీ తినమని చెపుతూ బాగా శ్రద్ధగా ఉన్నాడు. కానీ అలసటగా, పరధ్యానంగా, బాగా అలిసిపోయినవాడిలా ఉన్నాడు. నీలకి మరింత ప్రేమగా అనిపించింది. తను కూడా అతనిపట్ల అభిమానం ప్రకటించే చిన్నచిన్న మాటలు చెపుతూ వస్తోంది.

ఎందుకో అకస్మాత్తుగా డైరీలో రాసుకున్న మూడవ సూత్రం గుర్తుకు వచ్చి ఇతనితోనే తను జీవితాంతం ఉండాలన్నది కొత్తగా మనసుకి పట్టిచ్చుకున్నట్లు పదేపదే చెప్పుకుంది. గోదావరి వంతెన మీదుగా రాజమండ్రి చేరినపుడు పుస్తకాల్లో చదివిన విషయాలు కొన్ని గుర్తుకు వచ్చాయి. వాటికీ తన చుట్టూ పరిసరాలకీ లంకె వేసుకుంటూ వస్తోంది.

రైలు దిగాక ఆటో ఎక్కారు. పావుగంటలో దానవాయిపేట లోని వీరాంజనేయా కన్‌స్ట్రక్షన్స్ అన్న బోర్డు ఉన్న ఇంటిముందు ఆటో ఆగింది. లగేజ్ దింపుకున్నాక ప్రసాద్ పక్కింటికి వెళ్లి ఏదో చెప్పివచ్చాడు. రెండునిమిషాల్లో దాదాపు ముప్ఫయేళ్ల వయసున్న లలిత హారతి పట్టుకుని వచ్చింది. ఆమెపక్కనే ఉన్న పదేళ్ళపాప నీలవంక ఆసక్తిగా చూసింది.

"అనూష" అన్నాడు ప్రసాద్ పరిచయం చేస్తున్నట్లు.

నవ్వుతూ రమ్మని తలాడిస్తే వచ్చి నీలపక్కన నిల్చుంది. ప్రసాద్‌కీ నీలకీ బొట్టుపెట్టి హారతిచ్చి ఇంట్లోకి తీసుకువెళ్ళింది. ఆమెతో పాటు వచ్చిన వాళ్ళాయన సత్యమూర్తి, ప్రసాద్‌కి షేక్‌హాండ్ ఇచ్చి అభినందనలు చెప్పాడు. టీ పంపిస్తామని చెప్పి లలితవాళ్ళు వెళ్ళిపోయారు.

ప్రసాద్‌తో కలిసి ఉండబోతున్న ఇల్లు. అసలది కాదు గానీ తనకంటూ ఒక ఇల్లు అన్న ఆలోచన కొత్తగా ఉంది నీలకి. ఇరుకిరుకు గదిలో నానా బాధలు పడిన రోజులు మర్చిపోలేదు. చర్చిలో పాష్టరమ్మ వాళ్ళ ప్రేమ వల్ల పొందిన స్థలమూ మర్చిపోలేదు. కానీ ఈ ఇంట్లో తను హక్కుగా ఉండబోతున్నది.

ఇల్లంతా తిరిగి చూసుకుంది. గ్రిల్స్‌తో ఉన్న ముందుగదిని ఆఫీసు రూమ్‌గా మార్చారు. లోపల రెండు బెడ్రూములు, వాటికి ఎటాచ్డ్ బాత్రూమ్స్, కొంచెం పెద్దహాల్, పొందికైన కిచెన్, చాలా సౌకర్యవంతంగా ఉంది. అన్నీ తిరిగి చూస్తుంటే ప్రసాద్ కలకలలాడుతూ నీల వెనకే వచ్చి అన్నీ వివరించాడు.

"ఈ ఇల్లు కొన్నాళ్ళలో మనది కాబోతోంది. ఓనరు అమ్మేస్తానంటున్నాడు. వీలు చూసుకుని తీసుకుందాం. అపుడే ఎవరితోనూ అనకు. తమరు కరుణించి ఏ వారసుడినో ప్రసాదిస్తే వాడికోసం సంపాదించాలి. ముందు ఆడపిల్ల అయినా ఫర్లేదు. మన పిల్లలంటూ మనకి ఉండాలి." అతను తన్మయత్వంతో తన ప్రణాళికలు వివరిస్తుంటే ఇద్దరికీ మధ్య ఏదో స్నేహం కుదిరినట్లనిపించింది. అతను చెపుతున్నవన్నీ ఇష్టంగా వింది.

నా మనిషి నా ఇల్లు, నా పనులు అన్నటువంటి ప్రత్యేకమైన సొంతదనం ఏదో జీవితంలోకి వచ్చిందన్న ఆలోచన ఆమెని నిలవనీయడం లేదు.

నీల ఆలోచనల్లో ఉండగానే ప్రసాద్ స్నానంచేసి బైటకి వెళ్ళడానికి తయారయ్యాడు. ఈ మధ్యంతా వూళ్ళో లేకపోవడం వల్ల ఎక్కడి పనులు అక్కడ వదిలేసానని అవన్నీ చక్కబెట్టు కోవాలని తనకోసం ఎదురు చూడొద్దని ఆఫీసు కుర్రాడు బాబ్జీ కారేజ్ తెస్తాడని చెప్పాడు.

"అలాగే, నాగురించి గాభరా పడొద్దు. మీ పనులు చూసుకోండి ముందు" అంది నీల. ఆ మాటల్లోని కొత్తదనానికి పరవశిస్తూ ఆమెవైపు కొంచెం వింతగా కొంచెం సంతోషంగా చూసి గట్టిగా కావిలించుకుని,

"నువ్వు నా బంగారానివి. కష్టాల్లో పెరిగిన పిల్లవి కదా మంచీ చెడూ తెలుసుకోగలవు." అంటుంటే ప్రసాద్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కనపడకుండా ఉండటానికి మొహం పక్కకి తిప్పుకుని,

"ఏవన్నా అవసరం అయితే పక్కింటి లలితగారిని అడుగు. ఆమెకి చెప్పాను చూస్తుండమని. వస్తాను మరి జాగ్రత్త" అంటూ బయల్దేరాడు.

## 4

# చోళదిబ్బ 1997

తావరగిరా నుంచి చోళదిబ్బకి తిరిగి వస్తున్నపుడు బస్‌లో విశ్రాంతిగా ఉన్నట్టు అనిపించింది నీలకి. కిటికీలోంచి బైటకి చూస్తూ ఉంటే లోకమంతా చాలా ఉత్సాహంతో పరుగులు పెడుతున్నట్లే కనిపించింది. బస్సు ముందుకు పోతుంటే వెనక్కి పరిగెత్తే చెట్లూ, మధ్య మధ్య పలకరించే కరెంటు స్తంభాలూ పంట పొలాలూ రక్కిస పొదలు అక్కడక్కడా ఇళ్ళూ యానిమేటెడ్ చిత్రం చూస్తున్నట్లుగా ఉంది.

విసుగుపుట్టే దాకా చూసి చూసీ అలసటతో కళ్ళుమూసుకుని పడుకుంది. నిరామయం అయిపోయిన ఆ స్థితి నుంచి బైట పడేయడానికి పగటి కలలు కొన్ని ఆమెని కవ్విస్తూ ఉవ్విళ్ళూరిస్తూ ఆవరించుకుని ఉన్నాయి. అవి మనసుని ఎంత తాజాగా మార్చాయో కొలవడం ఎలా సాధ్యం!

మచ్చుకి ఒకటి -

తనిట్లా నానా బాధలు పడుతూ పగలనకా రాత్రనకా బాగా చదివి ఐఎఎస్ సాధించింది. సినిమాల్లో చూపించినట్లు వెంటనే కలెక్టర్ అయి తూర్పుగోదావరికే వచ్చింది. ప్రజల సమస్యలని చకచక పరిష్కరించేస్తూ అందరికీ ఆరాధనీయగా మారిపోయింది. ప్రసాద్ సరళతో అనేకతిప్పలు పడి చివరికి కట్టుబట్టలతో రోడ్డున పడ్డాడు. అపుడు నీల అతన్ని ఆదరించి తన మంచితనం ఏంటో నిరూపణ చేసింది. అప్పట్నుంచీ అతను ఆమెని బాగా ప్రేమించడం మొదలుపెట్టాడు.

అలాగే ఇంకొకటి -

పాష్టరు మావయ్య నీల పెళ్లపుడు ఇచ్చిన డబ్బుతో ఏదొక వ్యాపారం మొదలు పెడుతుంది. అది అలా అలా పెరిగి చాలా పెద్ద కంపెనీగా అవుతుంది. దాన్లో చాలా మందికి ఉద్యోగాలిస్తూ మంచి వ్యాపారస్తురాలిలా మారిపోతుంది. దాన గుణశీలిగా కూడా పేరు గడిస్తుంది. పాష్టరమ్మని ఇంటికి తెచ్చుకుంటుంది.

పిన్ని కూతురి పెళ్లి తన చేతుల మీదు గానే చేస్తుంది. నీల తమ్ముడు క్షమాపణలు కోరి ఆమెని కావిలించుకుంటాడు. తన వైభోగం చూసి ప్రసాదూ సరళా అసూయ పడుతూ ఉంటారు. వాళ్ళ అసూయ వాళ్ళ కడుపుమంట ఆమెని ఇసుమంత కూడా తాకేది కాదు. ఎందుకంటే తనది ఎక్కువ స్థాయి జీవితం కదా!

ఎక్కడ చిన్న అపసవ్యత కనపడినా ప్రశ్నలతో విరుచుకు పడే ఆమె మనసు పగటి కలల విషయంలో అత్యంత ఉదారంగా వ్యవహరించింది. మంచి తనానికి, అధికారాలతో వ్యాపారాలతో అంతగా పొత్తు కుదరదని ఆ రోజు గుర్తుకు రాలేదు. తర్వాత ఎపుడూ అటువంటి ఊహలు చేయలేదు. బహుశా ప్రయత్న పూర్వకంగా వాటిని దాటి ఉంటుంది.

ఇన్ని ఆలోచనల మధ్య కూడా పాప భవిష్యత్తుని గురించిన ఆలోచన రాలేదు. పాపని బాగా చదివించి గొప్పదాన్ని చెయ్యాలన్న ఆరాటం పెద్దగా ఉండేది కాదు. అందుకే  పాప పెంపకం  బరువుగా హైరానాగా అనిపించలేదు.

తెలిసినవాళ్ళు ఒకరిద్దరు మాత్రం, 'అదే ప్రసాద్ వద్ద ఉంటేనా! రాణీవాసం అనుభవించి ఉండేది. ఎంత తెలివి తక్కువతనం ఇపుడిలా పిల్లతో రోడ్డున పడటం?' అనేవారు.అలాంటపుడు కూడా ఆమె పాపవిషయంలో గొప్పగా పౌరుష పడిందిలేదు. తనకీపాపకీ మధ్య ఏమీ తేడాలేదని అనుకోవడం పైకి కనిపించేంత మామూలు ప్రేమ కాదు.

అయితే అందులో ఏదో గొప్పతనం ఉందని, దాన్ని పైకి ప్రకటించు కోవాలని, అందరికీ చెప్పుకుని సానుభూతి పొందాలని అనుకోలేదు. పాపని తనతో తిప్పుకోవడం అనేది ఆమెకు  ఎపుడూ బరువు కాలేదు. ఒక మృదువైన పిల్లి పిల్లని మెత్తనిపక్క పరిచిన వెదురుబుట్టలో పెట్టుకుని చులాగ్గా చేత్తో పట్టుకుని తీసుకు వెళ్తున్నట్లుగా భావించేది. అయితే వారిద్దరిలో ఎవరు పిల్లిపిల్లో ఒకోసారి ఆమెకే అర్థమయ్యేది కాదు.

చోళదిబ్బలో అడుగుపెట్టే ముందే తనకి తను గట్టిగా చెప్పుకున్న విషయం ఏంటంటే రాళ్లేరుకున్నా పూలేరుకున్నా ఇక ఈ నేల మీదే జరగాలని. బతుకు చెడి పట్నం చేరడం అనేది పాత సామెత. పట్నం బోల్డు అవకాశాలిచ్చి రారమ్మని పిలుస్తుంది. కానీ ఒంటరి బతుకు భయపెడుతుంది. ఇక్కడ తెలిసిన వాళ్ళు ఉన్నారు. కనీసంలో కనీసం తెలిసి మెసిలిన లోకం ఉంది.

ప్రతిరోజు చివరా ఒక కామా ఉంటుందన్న ధీమా ఎప్పటినుంచి సడలడం మొదలైందో తెలీదు కానీ కంటిఎదురుగా ఫుల్‌స్టాప్ చాలా తరుచుగా కనపడుతూ ఊపేస్తోంది. జీవితం బాగా సాగి ముడుతలు పడిపోతున్నట్లు ఉండుండి అనిపిస్తోంది. జీవితేచ్ఛ ఇచ్చే ఎలాస్టిసిటీ కనుక లేకపోయి ఉంటే ఈ భూగోళం ఎంత విసుగెత్తించి ఉండేదో!

# 5

## విశాఖపట్నం 1999

తూర్పు తీరాన సుందర నగరం.

స్వర్గమంటూ ఉంటే అది ఇలా కాక మరోలా ఉండదని నమ్మక తప్పని ప్రాకృతిక సౌందర్యం ఉత్తరాంధ్ర. దానికి తలమానికం విశాఖపట్నం.

తూర్పు కనుమల సాన్నిహిత్యంతో పరిమళ భరితమైన ఇక్కడి వలిసెపూల లేత గాలులు మనసుని ఆహ్లాద పరుస్తాయి. సముద్ర తీర సహజమైన వెచ్చని యానగాలులు మనిషిని కూచోనివ్వకుండా ఉరుకెత్తిస్తాయి.

తలెత్తి చూసిన చోటల్లా పర్వతాలు దొంతులు కట్టి కళ్ళని కట్టేసు కుంటాయి. వాటి మధ్య దోబూచులాడే మేఘమాలలు ఒక దొంతి మీద నుంచి మరోదాని మీదకి దూకుతూ సాగుతాయి. అపుడపుడు బుద్ధిపుడితే దొంతుల మధ్య ఉండే లోయలోకి దూకి ఇష్టంగా మరణిస్తాయి.

సముద్రం, అడవి, మైదానం మూడూ మాటామాటా అనుకుని వచ్చి మళ్ళీ వెళ్ళడం మర్చిపోయి ఊసులాడుకుంటూ ఇక్కడే ఉండిపోయినట్లున్నాయి. ఉత్తరాంధ్ర అంటేనే ఆ మూడింటి కలబోత సౌందర్యం.

విశాఖలోని మువ్వలవాని పాలెంలో ముచ్చటైన చిన్నఇంట్లో ఉంటున్నాడు పరదేశి. ఇంటిముందు ఒక బాదంచెట్టు, ఎదురుగా రెండు కొబ్బరి చెట్లు కళ్ళని ఆహ్లాద పరుస్తాయి. కార్పోరేషన్ వాళ్ళు ఇనుపజాలీలలో వేసి పెంచిన మొక్కలు వృక్షాలుగా ఎదగడంతో ఆ వీధిలో పచ్చదనానికి లోటులేనట్లు ఉంది.

తీరైన రోడ్లు, చేయిచాస్తే అందే మోర్ షాపింగ్‌మాల్, ఇంటిపక్కనే బ్యూటీ పార్లర్,నాలుగడుగులు వేస్తే బస్టాండ్, కావలిసిన సదుపాయాలన్నీ కళ్ళ ముందరే. తొలిసారి నగరాన్ని చూసిన అనుభవంతో నీల విస్తుపోతూనే ఉంది. పరదేశికి తల్లి లేదు. అతని పదిహేనవ ఏట అనారోగ్యంతో ఆమె మరణించింది.

అది విన్నక్షణం అతన్ని తేరిపార చూసింది నీల.

“బాధగా ఉంటుందా?” తెలిసీ అడిగింది.

“ఊహూ. అలవాటైంది. కాకపోతే అపుడపుడూ సెల్ఫ్‌పిటీగా ఉంటుంది. ఇదుగో ఇలా మీలాంటి వాళ్ళని చూసాక పెద్దగీత ముందు చిన్నగీతలా ఉంటుంది” అన్నాడు.

వాళ్ళ నాన్న హృద్రోగ వైద్య నిపుణుడు. నాలుగేళ్ల కిందట అమెరికా వెళ్ళాడు. పరదేశిని తీసుకువెళ్ళడానికి అతను చాలా ప్రయత్నించాడు. కానీ అప్పటికే పీజీ చదువు ముగించి ఏయులో పరిశోధన చేయాలని నిర్ణయం తీసుకున్న పరదేశి ఇక్కడే ఉండిపోయాడు. ఆయన ఏడాదికోసారి ఇక్కడికొస్తే పరదేశి ఏడాదికోసారి అక్కడికి వెళ్లి వస్తాడు. ఆ రకంగా ప్రతీ ఆరునెలలకి ఒకసారి తండ్రీ బిడ్డా కలుసుకుంటారు. రెండురోజులు కలిసి గడుపుతారు.

వాళ్ళమ్మ ఇష్టపడి కట్టించిన ఇంట్లో ఉండటం అంటే ఆమె ఒడిలో సేదదీరడం అని పరదేశి ఉద్వేగంగా చెప్పుకున్నాడు.

ఇంటి పనులు చాలా మట్టుకు అతనే చేసుకుంటాడు. పై పనులకి ఇద్దరు సహాయకులు ఉన్నారు. ఇంటిముందూ వెనుక, ఇరుపక్కలా, మేడమీద రకరకాల క్రీపర్స్, పూలమొక్కలు కనువిందుగా ఉన్నాయి. పరదేశి వాళ్ళమ్మ పల్లెనుంచి వచ్చిన మనిషి కావడంతో పచ్చదనానికి ఆరాటపడుతూ మొక్కలు పెంచుకుంటూ ఉండేది.

నీల తన సామాన్లు ఒక గదిలో పెట్టుకుంది. సహాయకురాలు వచ్చి,

“ఏమమ్మా బావున్నారా?” అంటూ పలకరించింది.

తనకి ఆమె పరిచయం లేదే అని ఆలోచించింది నీల.

ఆమె మృదువుగా నవ్వి మంచినీళ్ళు, టీ కప్పు టేబుల్ మీద పెట్టి స్నానం చేసొచ్చాక భోజనం చేయడానికి డైనింగ్ రూమ్‌కి రమ్మని పిలిచింది. ఇంట్లో అలంకరణ చూస్తూ ఉండిపోయింది కాసేపు. తను అంతకు ముందు చూడని ఖరీదైన వాతావరణానికి అలవాటు పడటానికి ప్రయత్నిస్తూ అన్నిటినీ పరిశీలనగా చూస్తోంది.

పరదేశి ఆమెని అజ పట్టించుకుంటూ కొంచెం హైరానా పడ్డాడు. అట్లా వద్దని తనకి ఇక్కడ హాయిగా ఉందని, ఇంకా చెప్పాలంటే ఊహించనంత సౌఖ్యంగా ఉందని చెప్పింది.

మొదటి రెండురోజులూ ఆమె విశ్రాంతికే పరిమితం అయింది. పరదేశి యూనివర్సిటీకి వెళ్లి తన డేటాని మెరుగుపరిచే పనిలో పడ్డాడు. అతని గైడ్ చాలా ప్రశంసించాడు. డిగ్రీ కోసం కాకుండా ఒక ఇష్టంతో ఇట్లా పరిశోధించే వాళ్ళు సమాజానికి చాలా ఉపయోగపడతారని మిగతా పరిశోధకుల సమక్షంలో చెప్పాడు. ఈ సమాచారంతో నాలుగైదు పీహెచ్‌డిలు చెయ్యొచ్చని అన్నాడు.

## 6

# హైదరాబాద్ 2000

విశాలమైన స్థలంలో కట్టిన ఆ రెండంతస్తుల భవనంలో ఆ రోజు నిశ్శబ్దం నగారా మోతలా వినబడుతోంది. ఇంటిచుట్టూ వెయ్యిగజాల మేర పరుచుకున్న తోటలో పిట్టలు కూయడానికి కూడా సంకోచిస్తున్నట్లున్నాయి, కువకువమంటూ అణిచిపెట్టుకున్న గొంతులతో మెడలు నిక్కి నిక్కి చూస్తున్నాయి. తోట నుంచి లోపలికి వెళ్ళడానికి పలకలతో కూడిన సన్నని బాట ఉంది. అద్దంలా తుడిచి నట్లున్న ఆ బాటమీద అడపాదడపా ఎండుటాకులు ఎగిరివచ్చి కాసేపు ఆడుకుని మళ్ళీ గాలికి కొట్టుకుపోతున్నాయి.

సికింద్రాబాద్ సైనికపురి కాలనీలోని అతి పెద్ద ఇళ్ళలో ఒకటి శివమ్. ఈ రోజు తన వైభవాన్ని పక్కన పెట్టి విచారాన్ని ముసుగేసుకుంది.

బయటనుంచి గేటుదాటి లోపలికి మెత్తగా వచ్చిన కారు, పోర్టికోలో ఒదిగింది. కారు దిగిన సదాశివ చేతిలోని పూల దండని పదిలంగా పట్టుకున్నాడు. కొంచెం ఒత్తిడి తగిలితే పూల రేకులు రాలిపడతాయేమోనన్నట్లు అతి జాగ్రత్తగా నడుస్తున్నాడు.

ముప్ఫయి నాలుగేళ్ల వయసుని తోసివేసి, అతను వేసుకున్న తెల్లని కాటన్ చొక్కా ఒక రకమైన పెద్దరికాన్ని ఇస్తోంది. లేదా ఆ పెద్దరికాన్ని అతనే తన మీద వేసుకున్నట్లు గంభీరంగా ఉన్నాడు. ఈ లోకంలోని చాలా విషయాలని సాధికారికంగా వ్యాఖ్యానించగల సదాశివ ముఖకవళికల్లో మాత్రం ప్రగాఢమైన దిగులు, బెంగ గూడుకట్టుకుని కనపడిపోతూ ఉంటాయి.

అతను సిగ్గరి. బిడియస్తుడు.

లాయరుగా ఎట్లా రాణిస్తున్నాడోనని మిత్రులు వేళాకోళం చేస్తారు. అతనెప్పుడూ వాగ్ధాటిని చూపి న్యాయాన్ని కోరలేదు. అతని విశ్లేషణా సామర్థ్యం వల్ల మాట్లాడిన ఒక్క మాటా బుద్ధిని సూటిగా తాకుతుంది. కొంచెం చిన్న గొంతుకతో, మర్యాద పూర్వకమైన వాక్య విన్యాసంతో, తర్కాన్ని వాడేపుడు

డాంబికం, హేళన ధ్వనించకుండా మాట్లాడతాడు. అతని మాటల్ని జడ్జీలు కూడా చెవి దోరపెట్టి వింటారని చాలా మంది క్లయింట్లు చెప్పుకుంటారు. క్రిమినల్ లాయర్‌గా మంచి పేరు సంపాదించాడు.

అతనికి మనసుకి, బుద్ధికి చాలా ఇష్టాలు ఉన్నాయి. చదువు న్యాయవాదమే కాని, చదివేది మాత్రం ఎక్కువగా సాహిత్యమే. మనుషులు, ఏ తేడాలు లేకుండా సమాన ప్రతిపత్తితో ఉండే సమాజం రావాలని, అందుకోసం బహుముఖాలుగా జరుగుతున్న అన్నిప్రయత్నాలను, ఉద్యమాలను సమర్థించాలని అతను అనుకుంటాడు. ప్రస్తుతం తెలంగాణ వాదం మీద అతని మనసూ బుద్ధీ రెండూ లగ్నమయ్యాయి.

ఇక్కడి వాడివి కాబట్టే నీకు తెలంగాణ వాదం నచ్చుతోంది అంటే ఆతను ఒప్పుకోడు. ఎక్కడి వారైనా న్యాయం చూడగలిగితే సరైన పక్షంలోనే ఉంటారంటాడు. తెలంగాణాకోసం త్వరలో ప్రత్యేక రాజకీయపార్టీ వస్తుందంటున్నారు కాని, సదాశివ ఆసక్తులు అటువంటి వేదికల మీద ఉండవు.

దేశంలో అధిక భాగం తెల్లవాళ్ళ పాలనలో ఉంటే, ఒక ద్వీపం లాగా దేశీయ రాచపాలనలో ఉన్న తెలంగాణ, ఆ తెలంగాణలో బ్రిటిష్‌పాలనలో ఉండిపోయిన సికింద్రాబాద్ సదాశివకి ఎప్పుడూ విస్మయం కలిగిస్తాయి. సరిహద్దులు లేని ప్రపంచం అంటూ గ్లోబలైజేషన్ ముంచుకు వస్తున్నప్పుడు, కొత్త సరిహద్దులు కోరడంలో ప్రజల వ్యూహం ఏంటన్నది అతనికి కుతూహలం.

దివాన్‌ఖానా మీదుగా లోపలికి తొంగి చూసిన సదాశివ రెండు క్షణాలు ఆగాడు. విశాలమైన హాలు లోపలి భాగం కొంత బైటకి కనబడుతోంది. గోధుమ రంగు ఆయిల్ పెయింట్ వేసిన గోడలమీద కొన్ని వర్ణచిత్రాలు వేలాడదీసి ఉన్నాయి. అనేక తరాలుగా అవి గోడలని అలంకరిస్తూ వస్తున్న సూచనగా కొంత పాతదనం కనపడుతూ వాటి విలువను పెంచుతోంది. వాటి అమరిక కూడా కాలాన్ని బట్టో చిత్రకారుని బట్టో ఒక పొందికని సంతరించుకుని ఉంది. తమ నెలవులు తప్పని బుద్ధిమంతులలా ఆ చిత్రాలు గోడలమీద స్థిరపడి ఉన్నాయి.

హాలు నడినెత్తి మీద లేతగులాబీ రంగు క్రిస్టల్ షాండిలియర్ ఉంది. దాని మీద బైటివెలుగులు పడి కొత్తకాంతి పుడుతోంది.

ఏటితీరంలాంటి నుదుటి మీదకి జారిన పాపిటబిళ్ళ మాదిరిగా ఆ వెలుగులగుత్తి చూపరులను ఆకర్షిస్తుంది. రాత్రిపూట పార్టీలలో చూపు తిప్పుకోలేని సౌందర్యంలో మొదటి స్థానం దీనిదే.

సట్లెజ్ నదీ పాయలోకి దుమికి జీవితాన్ని అంతం చేసుకున్న బంగోరె స్మృతిగా తెచ్చుకున్న కొన్ని గులక రాళ్ళు గాజు పాత్రలో వేసి నిండా నీళ్ళు పోసి చేతి పక్క బల్ల మీద పెట్టుకున్నాడు సదాశివ. నిరామయంగా ఉన్న వేళల్లో వేలితో

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Neela**

* * *